


# ...తెలిసినవాడు

పుష్యమి

**ఆ కుర్రాడు నాకు తెలిసినవాడే అనిపించింది చూడగానే. కాకపోతే ఎక్కడ చూశానన్నది చప్పున గుర్తుకు రాలేదు.**

**రోజూ ఉదయం ఆ హోటల్‌కి రావడం నాకు అలవాటు.**

**ఇంట్లో కాఫీ దొరకదని కాదు, ఇంటికి న్యూస్ పేపర్ చెబితే రాకుండా ఉండదనీ కాదు. నాన్ననుంచి వంశపారంపర్యంగా వచ్చిన అలవాటు అది.**

దాదాపు ముప్ఫయ్యేళ్ల క్రితం ... అంటే నాకు పదేళ్ల వయసులో నాన్నతో కలిసి మార్నింగ్ వాక్‌కి వెళ్లడం అలవాటయింది.

సరిగ్గా అయిదున్నరా పావు తక్కువ ఆరుకి నాన్న, నేనూ బయల్దేరేవాళ్లం.

ముఖ్యంగా ధనుర్మాసంలో వీధులనిండా ఉన్న ముగ్గులు చూస్తూ, ఏ ముగ్గు బాగుందో మాట్లాడుకునేవాళ్లం. అదే కార్తీకమాసం రోజుల్లో అయితే ప్రతి ఇంటిముందు పడేసిన టపాసుల చెత్త, కాల్చేసిన కాకరపువ్వొత్తులు చూస్తూ అంతకుముందు రోజు రాత్రి వాళ్లెలా టపాసులు కాల్చి ఉంటారో ఆలోచించేవాళ్లం.

అప్పుడే నాన్న బోలెడన్ని కబుర్లు చెబుతూండేవాడు.

గాంధీనగర్‌లోని ఓ కిళ్లీ షాపు దగ్గర నాన్న తెలుగు, ఇంగ్లీషు డైలీలు కొనేవాడు. ఆ తర్వాత ఆ పక్కనే ఉన్న ఓ హోటల్‌లో దూరి ఇద్దరమూ కాఫీ తాగి ఇంటికి తిరిగొచ్చేవాళ్లం.

ఉగాది, వినాయకచవితిలాంటి రోజుల్లో మరీ సందడిగా ఉండేది.

అమ్మ స్నానం, పూజ అయ్యేంతవరకూ పచ్చి మంచినీళ్లు కూడా తాగవద్దనేది. మేమిద్దరమూ చాలా రహస్యంగా ఆ హోటల్‌లో కాఫీ, టిఫిన్ లాగించేసేవాళ్లం. ఒకోసారి అమ్మ చేసిన ఉగాది పచ్చడికన్నా ముందుగా హోటల్‌వాడి ఉగాది పచ్చడి రుచి చూసేవాళ్లం.

ఆ మార్నింగ్‌వాక్‌లు ఓ హాయి. ఓ సరదా గమ్మత్తయిన అనుభూతి కలిగిస్తూండేవి.

పెరిగి పెద్దయినా, ఆ అనుభూతి తాలూకు ఛాయలు నన్ను వదల్లేదు. ఆ అలవాటు నన్ను అంటుకుంది.

ఏ ఊళ్లో ఉంటున్నా, రోజూ పొద్దున్నే పేపర్ కొనడానికి బయల్దేరి కాఫీ తాగడం నాకు తెలియకుండానే ఓ వ్యసనమై కూర్చుంది.

నేను రోజూ వెళ్లే హోటల్‌లోనే ఆ కుర్రాడు తారసపడ్డాడు.

"ఏం కావాలి సార్?" అనడిగాడు నా టేబుల్ దగ్గరగా వచ్చి.

నేను రెగ్యులర్ కస్టమర్‌ని కాబట్టి ... ఏ బేరర్ నన్ను అడగడు. ఓ కప్పు కాఫీ తీసుకొచ్చి అక్కడ పెడతాడు.

అలాంటిది వీడెవడా అని తలెత్తి చూశాను.

ఎక్కడో తెలిసిన ముఖంలా అనిపించింది. అయితే చప్పున గుర్తుకురాలేదు.

నేనా హోటల్‌కి తప్ప, మరో హోటల్‌కి వెళ్లనే వెళ్లను.

మరింకెక్కడ కనబడ్డాడు?

✣ ✣ ✣

ఆఫీసులో గుర్తొచ్చింది.

ఆ కుర్రాడు పదిరోజుల క్రితం మా ఆఫీసుకి ఇంటర్వ్యూకోసం వచ్చాడు - ఏదో క్లరికల్ జాబ్‌కోసం.

మా మేనేజింగ్ డైరెక్టర్ స్టెనోని నేనే కాబట్టి నా దగ్గరకొచ్చి, ఆ రోజు కొద్దిసేపు మాట్లాడాడా కుర్రాడు.

"ఎన్ని గంటలకి ఇంటర్వ్యూ రూమ్‌లోకి పిలుస్తారు?"

"ఎవరిచేతనైనా రికమెండ్ చేయించుకోవాలా?"

"జీతమెంతిస్తారు? జాబ్ సెక్యూరిటీ ఉందా?" లాంటి కూపీ ప్రశ్నలేవో వేశాడు. నేను సమాధానం చెప్పాను.

అయితే ఆ కుర్రాడికి ఉద్యోగం రాలేదు. ఎందుకంటే ఆ కుర్రాడు తెలుగు, ఇంగ్లీషు టైప్ హయ్యర్ పాసయ్యాడు కానీ, కంప్యూటర్ ఆపరేటింగ్ బొత్తిగా రాదు. ఆ ఒక్క కారణంతో మా ఆఫీసులో ఉద్యోగం పోగొట్టుకున్నాడు.

"జవహర్ అని ఓ అబ్బాయి వచ్చాడు. మిగిలిన క్వాలిఫికేషన్స్ ఓకే! కానీ, ఈ కాలం కుర్రాళ్లు కంప్యూటర్ నేర్చుకోకుండా ఎలా ఉద్యోగం చేయాలనుకుంటోన్నారో ఏమిటో?" అన్నాడు మా ఎం.డి.

ఆ మాట నా మనసులో నాటుకుపోయింది. అందుకే ఆ కుర్రాడు అంతగా గుర్తుండిపోయాడు.

✣ ✣ ✣

"ఏం జవహర్! ఏ ఉద్యోగం దొరకలేదా? వెయిటర్‌గా సెటిలయ్యావు!" అని పలకరించాను.

జవహర్ ఒక్క క్షణం ఆశ్చర్యంగా చూశాడు. నేను మా ఆఫీసు ఇంటర్వ్యూ గుర్తుచేశాను.

"ఈరోజుల్లో ఉద్యోగం దొరకడం చాలా కష్టంగా ఉంది! ఏదో ఒకటి కడుపు నింపుకోవడానికి కావాలి కదా సార్! ఇదయినా గట్టి రికమెండేషన్ చేయించుకుంటే దొరికింది!" అన్నాడు జవహర్ నవ్వుతూ.

"ఇంతకీ ఇక్కడ ఎంత ఇస్తున్నారు?"

"ఎనిమిది వందలు సార్! టిఫిన్, భోజనం ఇక్కడే!"

"ఇంత చదువుకుని హోటల్లో పని చేస్తున్నావని మీ ఇంట్లో వాళ్లేమనడం లేదా?"

"ఏదన్నా అనడానికి, అనుకోవడానికి వాళ్లిక్కడుంటే కదా సార్! నేనిక్కడ రూమ్‌లో ఉంటున్నాను!" అన్నాడు జవహర్.

అలా జవహర్‌తో నా పరిచయం పెరిగింది. రోజూ అందరికీ సర్వ్ చేసే అతడిని చూస్తుంటే ఒక్కోసారి బాధగా అనిపించేది.

ఆ మాట అతనితో కూడా చెప్పాను.

జవహర్‌కి నా పరిధిలో చిన్నదో, చితకదో ఇంతకంటే మంచి ఉద్యోగం సంపాదించాలని నా శాయశక్తులా ప్రయత్నించాను.

ఎట్టకేలకు విజయం సాధించాను! మా దూరపు బంధువుల ఆఫీసులో ఓ టైపిస్టు ఉద్యోగం ఉదంటే వచ్చి జవహర్‌కి చెప్పాను.

ఆ మాట వినగానే జవహర్ ఎగిరి గంతెయ్యలేదు. కళ్లు మిలామిలా మెరవలేదు. చాలా నిరాసక్తంగా చూశాడు నాకేసి.

నేనే చెప్పాను - "శాలరీ ఎంత అని అడగవే! పన్నెండొందలు! టెన్ టు ఫైవ్ ఉద్యోగం. అది చేసుకుంటూ కాంపిటిటీవ్ ఎగ్జామ్స్ రాసుకోవచ్చు!"

"ఈ సర్వర్ ఉద్యోగం చేస్తూ కూడా కాంపిటిటీవ్ ఎగ్జామ్స్‌కి ప్రిపేరవుతున్నాను. మీరు నా మీద ఎంతో అభిమానంతో ఉద్యోగం చూసి పెట్టారు. థాంక్స్! కానీ నాకా ఉద్యోగం వద్దు! పోనీ, నాకు తెలిసిన ఫ్రెండ్‌ని తీసుకురమ్మంటారా!" అనడిగాడు జవహర్.

నాకు ఛర్రున కోపం ముంచుకొచ్చింది. నేను ఇతగాడికోసం ప్రయత్నిస్తే, వాడు వాళ్ల ఫ్రెండ్‌కి ఇవ్వమనడమేమిటి?

నేను చూపించిన జాబ్‌కన్నా ఈ బోడి సర్వర్ జాబే గొప్పగా ఉందా? ఏమిటి ఈ జాబ్‌లో మహత్యం? టిప్‌లకు అలవాటుపడ్డాడా? లేక ఊరికే టిఫిన్లు, భోజనాలు వెళ్లిపోతున్నాయని ఆశపడ్డాడా?

నా ఆసక్తికి జవాబు అంత త్వరగా దొరకలేదు.

ఈ సంఘటన జరిగిన వారం రోజుల తర్వాత ఏదో పనిబడి, ఆఫీసుకి లీవు పెట్టాను. పది గంటల టైములో అదే హోటల్‌కి వెళ్లాను.

హోటల్ చాలా రష్‌గా ఉంది. నేను కూర్చునే టేబుల్ దగ్గర ముగ్గురు కుర్రాళ్లు కూర్చున్నారు. విపరీతమైన ఆకలిమీద ఉన్నారేమో - రెండు మూడు రకాల టిఫిన్లు లాగిస్తున్నారు.

నేనా పక్కనే కూర్చుని కాఫీ తాగాను. జవహర్ పలకరింపుగా విష్ చేశాడు.

బిల్లు చెల్లిస్తున్నప్పుడు చూశాను - నా పక్కన కూర్చున్న కుర్రాళ్ల బిల్లుమీద కేవలం రెండు టీల ఖరీదు మాత్రమే రాసి ఉంది.

జవహర్ ఏదో హడావుడిలో తక్కువ రాశాడా, లేక హోటల్ ప్రొప్రయిటర్‌ని మోసం చేస్తూ తను డబ్బులు వెనకేసుకుంటున్నాడా?

రెండోదే నిజమయ్యే అవకాశాలు కనబడ్డాయి.

"జవహర్! ఒక్కసారి బయటకి రా!" అని బయటకు తీసుకొచ్చాను.

"చెప్పు, ఆ కుర్రాళ్లు పది ఇచ్చారా, ఇరవై ఇచ్చారా? నలభై రూపాయలు తింటే అయిదురూపాయల బిల్లిస్తావా?" కోపంగా అడిగాను.

"ప్లీజ్, సార్! గట్టిగా మాట్లాడకండి! మా వాళ్లెవరైనా వింటే గొడవలైపోతాయి!" అని ప్రాధేయపడ్డాడు జవహర్.

"ఇలాంటి మోసం సొమ్ముకి కక్కుర్తిపడేనా ఆ రోజు ఆ ఉద్యోగం వదులుకున్నావు?"

జవహర్ మాట్లాడేదు. తల దించుకున్నాడు. "ఆ ఉద్యోగం వదులుకోవడానికి మాత్రం కారణం ఇదే! కానీ నేను మోసం చేసి డబ్బు సంపాదించడంలేదు!" అని, ఒక్క క్షణమాగి, "మీరు చూసిన కుర్రాళ్లు నా రూమ్మేట్స్! సరైన ఉద్యోగం లేదు, సంపాదనా లేదు. అలాగని ఆకలి ఆగదుగా! చాలాసార్లు ఈ టిఫిన్‌తోనే ఆ రోజు ఆకలి సరిపెడతారు.

"నేను చేస్తుంది తప్పే కానీ, నా ఫ్రెండ్స్‌కి ఇంతకుమించి సహాయపడలేను. నేనీ జాబ్ మానేస్తే నాకు నాలుగొందలు పెరగచ్చు. ఓ డిగ్నిఫైడ్ జాబ్ దొరకచ్చు. కానీ నా ఫ్రెండ్స్‌కి ఇలా అయిదురూపాయల బిల్లు ఇచ్చేవాళ్లెవరుంటారు?" అన్నాడు జవహర్.

జవహర్ నాకు తెలిసినవాడే కాదు, ఆకలి బాగా తెలిసినవాడు అనిపించింది. ■

## ఎవరి డిమాండ్ వారిది!

'గన్‌షాట్' చిత్రం హీరోయిన్‌గా చిత్రపరిశ్రమలో ప్రవేశించినా, కీర్తిరెడ్డి తగిన గుర్తింపు పొందలేకపోయింది. 'తొలిప్రేమ' హీరోయిన్‌గా నటించిన తర్వాత ఆమెపేరు దక్షిణాది భాషాచిత్రాల నిర్మాతా-దర్శకుల్లో మార్మోగిపోతోంది.

**'తొలిప్రేమ' చిత్రం సూపర్ హిట్ అయింది. ఇందులో మీ పాత్ర ఎంతవరకు?**

"ఏ చిత్ర విజయమూ ఏ ఒక్కరికీ అంటగట్టడం సముచితం కాదు. సమష్టి కృషిమీద ఆధారపడి ఉంటుంది ఏవిజయమైనా."

**'తొలిప్రేమ' విజయం తర్వాత మీరు హెవీగా డిమాండ్ చేస్తున్నారట?**

"రెమ్యూనరేషన్ మాట అటుంచండి. 'గన్‌షాట్' చిత్రంలో నా పరిచయం పరిశ్రమకు తెలుసు. ఎంతమంది నిర్మాతలు అడిగారు నన్ను? 'తొలిప్రేమ' చిత్రం హిట్ అయిన తరువాత దాదాపు డజను చిత్రాల ఆఫర్లు వచ్చాయి. కథల విషయంలో, కొన్ని కొన్ని టర్మ్స్ అండ్ కండిషన్స్ విషయంలో స్ట్రిక్టుగా ఉండటం కొంతమందికి మింగుడుపడకపోవచ్చు. ఐ కాంట్ హెల్ప్! ఈరోజు నటిగా నాకు డిమాండ్ ఉంది, వస్తున్నారు. నేనే కాదు, సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌లు కొంతమంది ఉన్నారు. ఎవరి డిమాండ్ వారిది!"

-ఐ.ఆర్.

